క్లుప్తంగా

శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు పొందిన వారితో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సెజ్ ప్రాంతంలో యువతకు కంప్యూటర్ కోర్సు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ, యువకులకు శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 31 మందికి ఫిల్మ్ డైరెక్టర్ ఉయ్యూరు విజయేంద్ర, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ వాసంశెట్టి కిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



సామర్లకోటలో మజ్జిగ పంపిణీ చేసిన నిర్వాహకులు

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులోని బాటసారులకు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. సంతమార్కెట్–2లోని శ్రీనివాస చికెన్ సెంటర్ యజమాని వీరబాబు సుమారు 150 లీటర్ల మజ్జిగను స్థానికులకు, బస్సులు, ఆటోలో ప్రయాణం చేసే ప్రయాణికులకు ఆపి పంపిణీ చేశారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీఓ కొండలరావు

గొల్లప్రోలు: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలు తప్పనిసరిగా నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఏపీఓ కొండలరావు సూచించారు. మండలంలోని చేబ్రోలు, ఏకే మల్లవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీల హాజరు, పనుల వివరాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు పనివేళలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారీ వేతనం రూ.300 వస్తుందన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పలువురు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శుక్రవారం స్ట్రాంగ్ రూములను సందర్శించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా స్థానిక జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్ భద్రతను ఆయన పర్యవేక్షించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కౌంటింగ్ సెంటర్‌ను కూడా సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు నిఘా ఉంటుందన్నారు. భద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామన్నారు. ఆయన వెంట పలువురు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన బాల సంస్కార్ శిబిరం

బోట్‌క్లబ్: స్థానిక ఓలేటివారివీధిలో ఉన్న విశ్వహిందూపరిషత్ కార్యాలయంలో నెల రోజులుగా సాగుతున్న బాలసంస్కార్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. బాలలకు భగవద్గీత 11వ అధ్యాయంలో 55 శ్లోకాలు, నీతి కథలు, వ్యక్తిత్వ వికాసం, సంస్కృతి సంప్రదాయాలపై శిక్షణ ఇచ్చారు. విశ్వహిందూపరిషత్ సంస్కృత ప్రచార విభాగం కన్వీనర్ గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో దువ్వూరి గంగాధర్ అభిరామ్ శాస్త్రి ప్రథమ, నిర్వాని వైష్ణవి ద్వితీయ, దువ్వూరి కృతిక్ తృతీయ, శార్వాణి, ప్రణవి, సింధూరి ప్రోత్సాహక బహుమతులు సాధించారు. కార్యక్రమంలో సహ కార్యదర్శి ఉదయభానోజీ రావు, విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షులు ఆర్.రవిశంకర్ పటానాయక్, సహాయ కార్యదర్శి రవివర్మ, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పూడికే ప్రధాన సమస్య


- కాలం చెల్లిన తాగునీటి పైప్‌లైన్లు
- ఫిల్టర్ చెరువులో పేరుకుపోయిన మట్టి
- శుభ్రత లేని తాగునీటి ట్యాంకులు
- అధికారుల అలసత్వంతో అవస్థలు



సామర్లకోట పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్



గోదావరి జలాలతో ఉన్న నాగార్జున ఫిల్టర్ చెరువు



సామర్లకోట గణపతినగరంలోని వాటర్ ట్యాంకు

సామర్లకోట: తాగునీటి వనరులపై అధికారులు సరైన శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉండూరు రైల్వే గేటు వద్ద 40 ఏళ్ల క్రితం 350 ఎకరాల్లో నాగార్జున చెరువును ఏర్పాటు చేశారు. 24 ఏళ్ల పాటు దానిని వినియోగించుకునే హక్కు ఉంది. గోదావరి నుంచి వచ్చే నీటితో ఆ చెరువును నింపి ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీటిగా మార్చి పంపిణీ చేయాల్సి ఉంది. కానీ నీటితో పాటు కొట్టుకువచ్చే మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నప్పటికీ అలా చేయకపోవడం వల్ల పూడిక పెరిగిపోయి నీటి మట్టం తగ్గిపోతోంది. ప్రస్తుతం నీటి మట్టం మూడు మీటర్లు చూపుతున్నా నీటి సామర్థ్యం మాత్రం మీటరున్నర మాత్రమే ఉంటుందని స్థానికులు అంటున్నారు. 15 ఏళ్ల క్రితం ప్రజారోగ్య శాఖ అధికారులు చెరువును పరిశీలించి ఆధునాతన యంత్రంతో చెరువు దిగువ భాగంలోని పూడిక తీయవచ్చని, ఇందుకు రూ.కోటి వ్యయమవుతుందని అంచనా వేశారు. ఆ వ్యయాన్ని అప్పుడు భరించలేకపోవడంతో నేడు ఆ పూడిక మరింత పెరిగిపోయింది.

ట్యాంకుల శుభ్రతపై అశ్రద్ధ

ఫిల్టర్ ప్లాంటు నుంచి పైప్‌లైన్ల ద్వారా గణపతినగరంలోని రెండు వాటర్ ట్యాంకులు, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న రెండు వాటర్ ట్యాంకులను నింపుతారు. ఆ ట్యాంకులను నిర్మించి సుమారు 35 ఏళ్లు అవుతోంది. వీటిని ఏళ్ల తరబడి శుభ్రం చేసిన దాఖలాలు లేవు. అలాగే 12 ఏళ్ల క్రితం కోట్లమ్మ చెరువు వద్ద నిర్మించిన నీటి ట్యాంకులను సైతం శుభ్రం చేసిన దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి.

కాలం చెల్లిన పైప్‌లైన్లు

సుమారు 24 ఏళ్ల క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్లకు కాలం చెల్లడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని, వాటిని బాగుచేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తరచుగా బ్లీచింగ్ నీటిని పంపితే నాచు, పసరుతో కూడిన నీరు కాకుండా స్వచ్ఛమైన తాగునీరు వచ్చే అవకాశం ఉంటుంది.

ట్యాంకులు, పైప్‌లైన్ల శుభ్రతే కీలకం



ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. ఏడాదికి ఒకసారైనా పైపులైన్లు, ట్యాంకులు శుభ్రం చేయాలి. 27 నుంచి 31వ వార్డుల వరకు తాగునీటి సమస్య తీరడానికి జలధార నిధులతో 30, 31 వార్డుల కూడలి ప్రదేశంలో వాటర్ ట్యాంకు నిర్మించాలి

– కరణం రాజ్‌కుమార్, కౌన్సిలర్, సామర్లకోట

నీటి ఎద్దడి లేని సమయంలో శుభ్రతపై దృష్టి



మున్సిపాలిటీకి రూ.26 కోట్ల జలధార నిధులు వచ్చాయి. ఆ నిధులతో చెరువుల్లో పూడిక తొలగింపుతో పాటు కొత్త పైప్‌లైన్లు వేసేలా కౌన్సిల్ తీర్మానం తీసుకుంటాం. తరుచూ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్నాం. నీటి వాడకం ఎక్కువగా ఉండని వర్షాకాలంలో వాటర్ ట్యాంకులు, ప్రధాన పైప్‌లైన్లు శుభ్రం చేయిస్తాం.

– జాస్తి రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ధూమపానానికి వ్యతిరేకంగా ప్రచారం



చినజగ్గంపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు

గొల్లప్రోలు: పట్టణంలో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగానికి వ్యతిరేకంగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రపంచ పొగాకు ఉత్పత్తుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ సునీత మెర్సీ ఆధ్వర్యంలో గొల్లప్రోలు పట్టణం, చిన జగ్గంపేట గ్రామాల్లో ప్రజలకు పొగతాగటం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల దేశంలో ఏటా 1.3 మిలియన్ల మంది మరణిస్తున్నారన్నారు. స్మోకింగ్ శరీరంలో అన్ని అవయవాలను ప్రభావితం చేస్తుందన్నారు. క్యాన్సర్, ఉదరం, గుండె సంబంధిత సమస్యలు రావడంతో పాటు అంగవైకల్యానికి కారణమవుతుందన్నారు. ధూమపానం, మద్యపానానికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై గరంగరం

- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న అధికారులు

పిఠాపురం: పట్టణంలో రూ.కోట్ల విలువ చేసే మంచినీటి పథకం ఉంది, ప్రతి నెలా రూ.లక్షల్లో ఖర్చు చేస్తూ తాగునీటి పథకాన్ని నిర్వహిస్తున్నా పట్టణంలో ఎవరికీ తాగునీరు అందడం లేదని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాలో పొందుపరచిన అంశాలను చదివి వినిపించగా వాటిని ఆమోదిస్తు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేస్తే ప్రజలకు తాగునీరు సరఫరా చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది ఉన్నా ప్రజలకు తాగునీటిని ఎందుకు సరఫరా చేయలేకపోతున్నారో సమాధానం చెప్పాలంటూ మున్సిపల్ కమిషనర్ కనకారావును కౌన్సిలర్లు నిలదీశారు. వేసవి తాపంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజలకు నీరు సరఫరా చేయకుండానే మంచినీటి సరఫరా పేరుతో నెలనెలా రూ.లక్షల్లో బిల్లులు తీసుకుంటున్నారని, దీనిపై సమాధానం చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. పట్టణంలో అనేక ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరు అందడం లేదని, కనీసం వాహనాల ద్వారా అయినా మంచినీటి సరఫరా చేయకపోవడమేమిటని మున్సిపల్ కమిషనర్ కనకారావును కౌన్సిలర్లు నిలదీశారు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన కుమారపురం వాటర్ వర్క్స్ ఉండగా కొన్ని ప్రాంతాలకు బోరు నీరు మాత్రమే ఇస్తున్నారని, దీంతో ప్రజలకు రక్షిత తాగునీరు అందడం లేదన్నారు. కుళాయిల నుంచి తాగునీరు రాకపోవడంతో ప్రజలు ప్రైవేటు ప్లాంట్ల నుంచి తాగునీరు కొనుగోలు చేస్తున్నారని, అధికారులు తక్షణమే స్పందించి పట్టణంలో అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చ జరగ్గా పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పారిశుధ్య సమస్య పెరుగుతోందని, వీధిలైట్లు, డ్రైన్లు, రోడ్లు పట్టణంలో చాలా అధ్వానంగా ఉన్నాయని, వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ-పిఠాపురం రోడ్డు



జనసంచారం లేక వెలవెలబోతున్న కొత్తపల్లి సెంటర్

- నిప్పులు కురిపిస్తున్న సూరీడు
- అల్లాడిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు

కొత్తపల్లి: వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో గురువారం భానుడు నిప్పులు కురిపించాడు. ఉదయం 9 గంటల నుంచే వడగాడ్పులు వీశాయి. ఎండకు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. ఉదయం 11 గంటలకే వ్యాపారులు షాపులు మూసివేశారు. సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత తగ్గలేదు. పిఠాపురం నియోజకవర్గంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ఎండ నుంచి రక్షణకు గొడుగులు, ముసుగులు ధరించారు. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలను పాటించకపోతే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆహారం, తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎండలో తిరగరాదు. ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. పండ్లు, తాజా ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. కొబ్బరి బొండాలు, జ్యూస్‌లు, నిమ్మకాయ, ఉప్పు కలిపిన నీరు ఎక్కువగా తాగాలి. ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సుష్మ, వైద్యాధికారి, కొత్తపల్లి పీహెచ్‌సీ

ఎవరి ధీమా వారిదే

- ఎన్నికల్లో గెలుపుపై జోరుగా బెట్టింగులు
- ఎవరికి వారే విజయం తమదేనని ప్రకటనలు



పెద్దాపురంలోని ఎన్నికల రిటర్నింగ్ (ఆర్డీఓ) కార్యాలయం

సామర్లకోట: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులు ఎవరికి వారే విజయంపై ధీమాగా ఉన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాలోని 41 గ్రామాలకు సంబంధించి 201 పోలింగ్ బూత్‌ల ద్వారా పోలింగ్ జరిగింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు విజయం తనదేననే ధీమాతో ఉన్నారు. స్థానిక బలంతో పాటు ప్రజలలో సానుభూతి కారణంగా దొరబాబు విజయం సాధిస్తారని కార్యకర్తలు ఆనందంతో ఉన్నారు. టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ప్రస్తుత ఎన్నికలల్లో విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తారనే ధీమాతో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో 10 మంది పోటీలో ఉండగా వైఎస్సార్ సీపీ, టీడీపీల మధ్యే పోటీ ఉంది. గత ఎన్నికల్లో జనసేన పోటీలో ఉండగా ఆ పార్టీకి 25 వేలు ఓట్లు రావడంతో ఆ ఓట్లు కూడా తమకే వస్తాయనే అంచనాలతో టీడీపీ నాయకులు ఉన్నారు. మహిళలు రాత్రి 10 గంటల వరకు బారులు తీరి ఓట్లు వేయడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలకు ఓట్లు వేశారని వైఎస్సార్ సీపీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. అయితే టీడీపీ నాయకులు మహిళలు ఉచిత బస్సు హామీకి ఓట్లు వేశారని టీడీపీ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ మేరకు విజయాలపై భారీ ఎత్తున బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు ఒక అడుగు ముందుకు వేసి రూపాయికి రెండు రూపాయలు ఇచ్చే విధంగా రూ.లక్షలలో బెట్టింగులు కాస్తూ కాలు దువ్వుతున్నారు.

ఏది ఏమైనా 4వ తేది వరకు ఎన్నికల ఫలితాల కోసం వేచి ఉండాలి. కాకినాడ జిల్లాలో పెద్దాపురం ఎమ్మెల్యే ఫలితమే మొదటిగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల కంటే తక్కువ రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుంది. అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈవీఎంలను కాకినాడ జేఎన్టీయూలో స్ట్రాంగ్ రూమ్‌లో భారీ బందోబస్తు మధ్య భద్రపర్చారు. ఫలితాల అనంతరం బాణసంచా కాల్పులు చేయకుండా ఉండే విధంగా ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని ఏడు బాణసంచా తయారీ షాపులు మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు



సామర్లకోటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక మారుతినగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం తెల్లవారు జామున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులచే సామూహిక వ్రతాలు, సాయంత్రం హోమం, రాత్రి స్వామి వారికి పుష్పాలు, తమలపాకులచే అభిషేకాలు నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్త చింతామణి పంతంజలి శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయి. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సీనియర్లను ఆదర్శంగా తీసుకోవాలి

- ఆర్డీఓ సీతారామారావు
- ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణ చేసిన సుబ్రహ్మణ్యంను సత్కరించిన ఆర్డీఓ తదితరులు

సామర్లకోట: ఆయా కార్యాలయాల్లో సీనియర్ ఉద్యోగులు చేసిన సేవలను ఇతర ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి కర్నాసుల సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీతారామారావు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ సమయంలో భూముల సేకరణలో సుబ్రహ్మణ్యం సేవలను కొనియాడారు. ప్రభుత్వ భూముల సేకరణతో పాటు ఎటువంటి వివాదాలు లేని భూములను పేదలకు ఇచ్చేలా ఆయన ఎంపిక చేశారని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తమకు తెలియజేసి నియోజకవర్గంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేలా మంచి సలహాలు ఇచ్చారని అన్నారు. అటువంటి సీనియర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని వారి బాటలో నడిచి ఆర్డీఓ కార్యాలయానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో 38 సంవత్సరాలు సర్వీసు చేయడం సాధారణ విషయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట తహసీల్దార్ జె.శ్రీనివాసు, పెద్దాపురం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు భానుకుమార్, పద్మజ, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఆనంద్, రమేష్ తదితరులు పాల్గొన్ని సుబ్రహ్మణ్యం, రమణి దంపతులను ఘనంగా సత్కరించారు.

కార్మికవర్గ ఐక్యతే సీఐటీయూ లక్ష్యం



సామర్లకోట సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన నాయకులు

సామర్లకోట: కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేసి విజయం సాధించడమే సీఐటీయూ లక్ష్యమని ఆ శాఖ మండల అధ్యక్షుడు బాలం శ్రీనివాసు అన్నారు. సీఐటీయూ 54వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలం శ్రీనివాసు మాట్లాడుతూ కార్మికవర్గ ప్రయోజనాలు కాపాడుకుంటూ కార్మికవర్గ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో 1970 మే 31న సీఐటీయూ ఏర్పడిందన్నారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, కనీస వేతనం అమలుచేయాలని, స్కీం వర్కర్లను, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను ఉద్యోగులుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు కరణం ప్రసాదరావు, హమాలీల సంఘ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు, అంగన్‌వాడీ పట్టణ కార్యదర్శి కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాయకుండ ఆపలేదు..!



పిఠాపురం: చెట్టుకు కాయలు కాయకుండా కుండ ఆపలేకపోయింది. తాటికల్లు కోసం చెట్టుకు గీత కార్మికులు ఏర్పాటు చేసిన కుండలను చీల్చుకుంటూ మరీ తాటికాయలు బయటకు వచ్చాయి. వివరాల్లోకి వెళితే...కొత్తపల్లిలో ఒక తాటిచెట్టుకు గీత కార్మికుడు కల్లు కుండలను ఏర్పాటు చేశాడు. కొన్ని రోజుల వరకూ కల్లు గీసిన కార్మికుడు ఇక కల్లు రాకపోవడంతో ఆ కుండలను అలా చెట్టుకు వదిలేశాడు. కొన్నిరోజులకు ఆ కుండలను బద్దలు కొట్టుకుని తాటి కాయలు రావడం చూసి ప్రతిఒక్కరు ఔరా అంటున్నారు. కుండల్లోంచి బయటకు వచ్చిన ముంజె కాయలు చూపరులను అబ్బుర పరుస్తున్నాయి.

కొత్తపల్లి ముత్యాలమ్మ చెరువు గట్టున ఉన్న తాటి చెట్టు (అంతరచిత్రం) కల్లు కుండల్లోంచి బయటకు వచ్చిన తాటి కాయలు

బెల్ట్ షాప్‌పై ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని టి.రాయవరంలో బెల్ట్ షాప్‌పై శుక్రవారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పెదపాటి చిట్టిబాబును అదుపులోకి తీసుకుని అతని నుంచి ఎనిమిది 180 ఎంఎల్ పరిమాణం గల మద్యం సీసాలను, ఆరు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. అలాగే ఒమ్మంగిలో మొగిలి ధర్మరాజును అరెస్టు చేసి, అతని నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు సంఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు.

లంగరు తాడు తెగి బోటు ధ్వంసం



రాళ్ల గోడను ఢీ కొట్టిన బోటు

కొత్తపల్లి: ఉప్పటేరులో లంగర్ వేసిన బోటు తాడు తెగి రాళ్ల గోడను ఢీకొట్టడంతో శుక్రవారం బోటు ధ్వంసం అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉప్పాడ శివారు నాయకర్ కాలనీకి చెందిన ఉమ్మిడి జగన్నాథం వేట నిషేధం కావడంతో రామన్నపాలేం వద్ద ఉన్న బోటుకు లంగర్ వేశాడు. కొద్దిరోజులుగా కెరటాల ఉధృతి కారణంగా లంగర్ తాడు తెగి బోటు రాళ్ల గోడను ఢీకొట్టింది. దీంతో బోటు అడుగు భాగం పూర్తిగా ధ్వంసమై సుమారు రూ. 4లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు తెలిపాడు. 2006 సంవత్సరంలో కూడా వేట నిషేధ సమయంలో లంగర్ వేసిన బోటు తాడు తెగి ధ్వంసం అయినట్టు జగన్నాథం ఆవేదన వ్యక్తం చేశాడు.